కార్డుకథలు.

కృష్ణప్రసాద్ • యన్. సీతారామయ్య
హరి.

# నర్తకి

తార గొప్ప నర్తకి అని పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. ఆమె అభివృద్ధికి కారకుడు వసంత్. గొప్పపాటకుడు అయిన శశాంక్ వాళ్ళలోజేరి ఆ కంపెనీకి విఖ్యాతితెచ్చాడు. తార అందగత్తెకాకుండా, చదువుకొన్నది, సునిశిత బుద్ధి. శశాంక్ అమాయకుడు, Idealist. వసంత్ ధనవంతుడు. తారని పెళ్ళిచేసుగుని సంపూర్ణంగా తనదానిని చేసికొని సర్వసౌఖ్యాన్ని చూరగొందామని గాలిలో మేడలుకట్టాడు. తార కనపడకపోయిన తహతహలాడి, ఆమె క్రీగంటి చూపుతో తన్మయతజెంది, ఆ సౌకుమార్యాన్ని పూజించి, ఆ దివ్యవిగ్రహాన్ని ఆరాధించి, ఆ కళాదేవత నర్తకిని తన గానలహరులచే ఆకట్టుకున్నాడు-శశాంక్. ఇటువంటి విపరీతమయిన రెండు మానవ మనస్తత్వశక్తులమధ్య-నలిగిపోతూ, ఏ ఒక్కరినీ విడవలేక, మానవ జీవిత విషాదపుటంచులను అవలోకిస్తూ, చిక్కిపోతూవున్నది నర్తకి. కాని ఆనాటికానాటికి ఉజ్జ్వలమౌతున్న ఆమెకళ్ళల్లోని వెలుగు, ఆమె సౌరభ్యము, వసంత్‌ని ఒక మొండిపట్టుదల గలవానిగా జేస్తూ, అతనిని నిద్రాహారాలనుండి దూరం చేస్తూ, పిచ్చివానిని చేస్తూన్నది. తార ప్రతిమాలింది: భంగపడింది; శశాంక్ తన్ను ఒదిలి వుండలేడు, బ్రతకలేడు....అది తను భరించలేదు. తను వసంత్ యెడల కృతఘ్నురాలేమో: సర్వదోషాలూ, అందరినిందలూ, తనమీదేనేమో ....అందుకని, తన శరీరమేకావాలి కనుక దానిని అనుభవింపమని....మానసిక స్వతంత్రం మాత్రం వదుల్కొనలేనని వసంత్‌ని ప్రార్థించింది. నర్తకి తనదికావాలి—ఇంకోడు తేరిపారజూడగూడదు ....సంపూర్ణంగా అంతా తనదే అయిపోవాలి.... ఇది అతని పట్టుదల....తార అస్వస్థతచూసి శశాంక్, తార క్షేమంకోసమని హృదయభారంతో యిల్లు విడిచి వెళ్ళిపోతూ, కొంత దూరము వెళ్ళాక పడిపోయాడు. మర్నాడు తార వెతికి తీసుకొనివచ్చింది, వసంత్ అంతక్రితం రోజే తార, శశాంక్ యిద్దరూ ఒకచోటే శయనించడంచూచాక... అతని మతిపోయింది....పిచ్చి

తార శశిని వెంటబెట్టుకువెళ్ళి; వసంత్‌ని మందలించింది....అంత స్వార్థం కూడదన్నది. తనను బానిసకావాలనే అతనివాంఛ పశుతుల్యమని ఉద్రేకంలో అన్నది. కొంచెం స్పృహలో వున్న వసంత్ తనవిరోధిఅయిన శశిని" వెళ్ళిపో" అని కేకవేశేసరికి తార అతనితో మేడదిగి వెళ్ళింది. అది చూసిన వసంత్ ఆ విస్పృహలోనే తారకోసం ఖంగారుతో మేడమెట్లుదిగుతూ జారిపడ్డాడు. తార శశి యిద్దరూ ప్రాణతుల్యంగా సేవచేస్తూన్నారు.

ఒకరోజు రాత్రి తెలివివచ్చిన వసంత్, తారా శశిల చేతులుకలిపి, తార నృత్యం శశిపాట, వింటూ, చూస్తూ కన్నుమూసాడు....అతనిమీద నర్తకి వ్రాలిపోయింది........శశి పిచ్చివాడయిపోయాడు నిజంగానే.

# సైరను

సూర్యోదయం అయింది, సూర్యుడు తన లేతకిరణాలు వెదజల్లుతున్నాడు. కాలకృత్యాలు తీర్చుకొని ఎవరి పనులకు వాళ్ళు వెళ్ళుతున్నారు ప్రజలు. శత్రువిమానాల జాడ కనిపించింది. ఎ. ఆర్. పి. దళం సైరను వూదింది. చేస్తూవున్నపనులు మానేసి తమ ప్రాణాలు దక్కించుకోటానికి, షెల్టర్లలో దూరటానికి, పరిగెత్తుతున్నారు ప్రజలు. తల్లికోడి తనపిల్లల్ని మేపడానికి, పచ్చికబయలుకి తీసుకొనివెళ్ళింది. ఆకాశాన గ్రద్ద కనుపించింది. తల్లికోడి సైరను వూదింది, పిల్లలు తమ ప్రాణాలు రక్షించుకోడానికి, పొదలలోకి పరుగెత్తాయి, వాటికి స్వజాతి విరోధంలేదు.

—యన్. సీతారామయ్య.

# "కొందిశీకుడు"

నాయనా, అమ్మా, తమ్ముడూ, అక్కా, చెల్లెలూ, టవాయి కార్ఖానాలోవున్నారు—మన కోస్తావాళ్ళు దేశం పోడానికి సిద్ధమయివున్నారు—బయలుదేరాలి"

'బాబూ, అదో అక్కడ చెట్టునీడను కాస్త విశ్రమిద్దాం—మీ అమ్మ ఏది?''

'అమ్మా! అమ్మా'

తమ్ముడూ—అదో అక్కడ నీళ్ళున్నవి—త్రాగుదాం—నాయన్ని పిలువు"

''నాయనా! నాయనా''

''అన్నా, చిన్నచెల్లెలు నిద్రపోతుందే—పొద్దుటినుంచీకూడా!—లేపండన్నా''

''అయ్యో, చెల్లీ ....చిట్టిచెల్లీ''

''తమ్ముడూ....[illegible] పిలువరా—అక్కడ భోజనం పెడుతోన్నారట బెంగాలీ బాబులు''

''ఏదీ అక్క—అన్నా! అక్క అమ్మను పిలువడానికి వెళ్ళిందేమో''

''బాబూ, యీ కుర్రాడికి గంజిలేక మాట రావడంలేదు—కాస్త గంజి'' పోయండి బాబూ.

''కుర్రాడి ప్రాణం పోయినట్టుందే పాపం!''

''దేవుడా—తల్లినీ, తండ్రినీ, తమ్ములనూ—అక్క చెల్లెండ్రనూ చంపుకుతిని—ఏడవడానికి నీళ్ళయినా కళ్ళలేని యీ నీరసపుబ్రతుకు నాకెందుకు!....క్రిందపడెను—ఒక లారీ అతనిమీదనుంచి పోవును—

కొందిశీకుని కష్టాలు తీర్చేవారులేరు—కొందిశీకుని కష్టాలు కడతేరేనా?—